06-09-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - సేవ యొక్క అభిరుచిని ఉంచండి, విశాలబుద్ధి కలవారిగా అయి సేవ యొక్క భిన్న-భిన్న యుక్తులను కనుగొనండి, ఏ విషయాలైతే అర్థరహితంగా ఉన్నాయో వాటిని సరిదిద్దండి"

ప్రశ్న:- అజామిళ్ వలే అశుద్ధముగా అయిన ఆత్మను శుభ్రపరిచే సాధనము ఏమిటి?

జవాబు:- ఆ ఆత్మను జ్ఞాన మానస సరోవరంలో ముంచేయండి, జ్ఞాన సాగరునిలో మునిగి ఉన్నట్లయితే ఆత్మలోని మురికి శుభ్రమవుతుంది.

ప్రశ్న:- బ్రాహ్మణులకు అన్నింటికన్నా పెద్ద పాపమేమిటి?

జవాబు:- బ్రాహ్మణులు ఒకవేళ తండ్రి ఆజ్ఞను పాటించకపోతే అది చాలా పెద్ద పాపమవుతుంది. తండ్రి ఇచ్చే మొదటి ఆజ్ఞ - మీరు నన్ను నిరంతరము స్మృతి చేయండి. కానీ పిల్లలు ఇందులోనే ఫెయిలైపోతారు, అప్పుడిక మాయ ఏదో ఒక వికర్మను చేయించేస్తుంది.

పాట:- ఆకాశ సింహాసనాన్ని వదిలి రా... (ఛోడ్ భీ దే ఆకాశ్ సింహాసన్...)

ఓం శాంతి. పిల్లల బుద్ధిలోకి ఏమొస్తుంది? ఎవరు వచ్చారు? (తండ్రి, శిక్షకుడు, సద్గురువు) మాత-పిత అన్న పదమైతే తప్పకుండా కావాలి. మాత-పిత అన్న పదము భారత్ లో ప్రాచుర్యములో ఉంది. నీవే తల్లివి, తండ్రివి... ఆ తర్వాత మీరు బాప్ దాదా అని అనవచ్చు. ఆ మాటకొస్తే మాత-పిత అని అన్నప్పుడు అందులో బాప్ దాదా అన్నది కూడా వచ్చేస్తుంది కానీ వేరుగా చెప్పాలి. ఇది అర్థం చేయించే విధానం ఎందుకంటే తండ్రి ఉన్నారు మరియు తల్లి కూడా తప్పకుండా కావాలి. ఇప్పుడు మొదటగా తల్లి ఎవరు? ఇది గుహ్యాతి గుహ్యమైన విషయము, దీనిని ఎవరూ అర్థం చేసుకోలేరు. ప్రజాపిత బ్రహ్మ ఉన్నా కానీ, మళ్ళీ మాత కావాలా? ప్రజాపిత బ్రహ్మతోపాటు ప్రజాపత్ని కూడా కావాలా? అలా కాదు. ప్రజాపత్ని అవసరం లేదు, ఎందుకంటే వీరు ముఖవంశావళి, అందుకే బ్రహ్మకు పత్ని ఎవరూ ఉండరు. ఇవి చాలా గుహ్యమైన మరియు గంభీరమైన విషయాలు, వీటిని అర్థం చేసుకునేందుకు మరియు ధారణ చేసేందుకు బుద్ధి కావాలి. పిల్లల సమ్ముఖంగా వచ్చే తండ్రి వీరొక్కరే. మాత-పిత, బాప్-దాదా సమ్ముఖంగా వచ్చారని మీరు అర్థం చేసుకున్నారు. బయట సేవ చేసే పిల్లలు, సెంటర్లలో ఉండే పిల్లలు మాత-పిత బాప్-దాదా సమ్ముఖంగా వచ్చారు అని భావించరు. వారు ఫలానా బి.కె. లేక బ్రహ్మకుమారి వచ్చారు అని భావిస్తారు. ఈ మమ్మా దత్తత తీసుకోబడ్డారు. అందరికన్నా అదృష్ట సితార జగదంబ, ఆమె సంభాళించేందుకు ముఖ్యులు, అందుకే ఆమెపై కలశము ఉంటుంది మరియు ఈ బ్రహ్మ పురుషుని రూపంలో బ్రహ్మపుత్రా అయినట్లు. కావున సరస్వతి తప్పకుండా కావాలి. సరస్వతినే జగదంబ అని అంటారు. ఈ పురుషుడిని జగదంబ అని అనరు. ఇది చాలా మంచి రహస్యము, ఇది ఇంకే గీత, భాగవతములలో లేదు. వారు కూర్చొని శాస్త్రాలలో కథలను వ్రాసారు. 5,000 సంవత్సరాల క్రితం లేక 2,500 సంవత్సరాల క్రితం ఏమి జరిగిందో కూర్చొని వ్రాస్తారు. ఆ నామ, రూప, దేశ, కాలాలేవీ లేవు కదా. నాటకాలను కూడా అనేక రకాలుగా తయారుచేస్తారు. పిల్లలు ప్రతి ఒక్క విషయాన్ని పూర్తిగా అర్థం చేసుకోవాలని ఈ తండ్రి కూర్చొని సమ్ముఖముగా బాగా అర్థం చేయిస్తారు. ఈ పాటలలో కూడా అర్థరహితమైన పదాలు ఎన్నో ఉన్నాయి. ఇప్పుడు ఇది ఆకాశ తత్వము, ఇందులో మనము కూర్చున్నాము. పారలౌకిక తండ్రి, ఎవరినైతే అందరూ తలచుకుంటారో, వారేమీ ఆకాశ తత్వము నుండి రారు. ఒకవేళ పారలౌకిక తండ్రి అని శ్రీకృష్ణుని ఆత్మను అన్నట్లయితే, మరి వారూ ఇక్కడే ఉన్నారు. ముఖ్యమైన ఆత్మలు, ధర్మస్థాపకులు మొదలైనవారందరూ ఇక్కడే ఉన్నారు. శ్రీకృష్ణుని ఆత్మ కూడా 84వ జన్మలో ఇక్కడే ఉంది. కావున వారి ఆత్మను అయితే పిలువలేరు. రండి, మీ మహాతత్వమైన నిర్వాణధామాన్ని వదలి అక్కడి నుండి రండి అని ఈ విధంగా పరమపిత పరమాత్మనే పిలుస్తారు. ఆత్మలైన మీ సింహాసనము ఆ మహాతత్వమే. ఆకాశంలో జీవాత్మలైన మీరు ఉంటారు. ఇది ఆట జరిగే ఒక రంగస్థలము. పాట వినేటప్పుడు దానిని హృదయంలో మీ అంతట మీరే సరిదిద్దుతూ వెళ్ళండి. ఎవరైతే నాటకాలను తయారుచేసారో, వారే మళ్ళీ పాటలను తయారుచేసారు. సినిమా షూటింగ్ చేసేవారికి కూడా అర్థం చేయించాలి. ఇందులో చాలా విశాలబుద్ధి కావాలి. బాబా సేవ చేసేందుకు సలహాను ఇస్తారు. ఆ డ్రామాను ఎవరైతే తయారుచేసారో వారికి ఇది అర్థం చేయించాలి, వారిని కలుసుకోవాలి, అంతటి వివేకము కావాలి. తండ్రి అయితే డైరెక్షన్ ఇస్తారు. తండ్రి వెళ్ళి అడగరు కదా. ఇలా, ఇలా చేయండి, శ్రీమతంపై నడవండి అని తండ్రి పిల్లలైన మీకు డైరెక్షన్ ఇస్తారు. (పాట) వాస్తవానికి పాటలో భూమి అనగా ఈ భారతఖండమే, భారత్ లోనే వారు రావడం జరుగుతుంది. భారత్ యే వారి జన్మ స్థానము. అందరూ ఆ నిరాకార

తండ్రినే పిలుస్తారు. శ్రీకృష్ణుడైతే అందరికీ తండ్రి కారు. మురళి ఏదైతే చూపిస్తారో అది శ్రీకృష్ణుని చేతిలో చూపించే వెదురు మురళి ఏమీ కాదు. మురళి అనేది వాస్తవానికి జ్ఞానానికి సంబంధించినది.

గాడెస్ ఆఫ్ నాలెడ్జ్ (జ్ఞాన దేవి) అని సరస్వతినే అంటారు. రాధేను అలా అనరు, శ్రీకృష్ణుడిని కూడా అలా అనరు. ఈ జోడి తండ్రి మరియు పిల్లలది. సరస్వతిని గాడెస్ ఆఫ్ నాలెడ్జ్ (జ్ఞాన దేవి) అని అంటారు. మరి తప్పకుండా బ్రహ్మాపుత్ర అయిన ప్రజాపిత బ్రహ్మా కూడా గాడ్ ఆఫ్ నాలెడ్జ్ (జ్ఞాన దేవ్) అయి ఉండాలి. కానీ బ్రహ్మా విషయంలో ఆ విధంగా మహిమ చేయరు. గాడ్ ఈస్ నాలెడ్జ్ ఫుల్ అని అంటారు. బ్రహ్మా నాలెడ్జ్ ఫుల్ అని అనరు, గాడ్ ఈస్ నాలెడ్జ్ ఫుల్ అని అంటారు. పరమపిత పరమాత్మ జ్ఞాన సాగరుడు కావున తప్పకుండా తమ పిల్లలకు జ్ఞానాన్ని ఇస్తారు. మొట్టమొదట వీరిలోకి ప్రవేశించి వీరి ద్వారా ఇతరులకు ఇస్తారు, ఇందులో అదృష్ట సితారలందరూ వచ్చేస్తారు. వారు జ్ఞాన సూర్యుడు, ఆ తర్వాత ఈ బ్రహ్మా జ్ఞాన చంద్రుడు, ఆ తర్వాత జ్ఞాన చంద్రునికి సమీపంగా ఒక సితార కావాలి, అది చంద్రునికి ఎదురుగా నిలిచి ఉంటుంది, అది చాలా ప్రకాశవంతంగా ఉంటుంది. ఆ సితారను జ్ఞానపు అదృష్ట సితార అని అంటారు. ఆమెకు సరస్వతి అన్న పేరు పెట్టడం జరిగింది. సరస్వతి కూతురు అవుతారు కదా. వీరు తండ్రి కూడా, అలాగే పెద్ద నది కూడా. వీరు చాలా పెద్ద నది. అన్ని నదులు సాగరంలో కలుస్తాయి. సాగరము మరియు నదుల మేళా జరుగుతుంది. సరస్వతి కూడా సాగరంలో కలుస్తుంది. అక్కడ మేళా జరగదు. బ్రహ్మాపుత్రా నది వద్దనే మేళా జరుగుతుంది. ఈ నది చాలా అద్భుతమైనది, వీరు పురుషుడు. నది అని వాస్తవానికి స్త్రీనే అనడం జరుగుతుంది. ఈ గుహ్యమైన రహస్యము ఎంతగానో అర్థం చేసుకోవలసినది. కానీ ఈ విషయాలను మొట్టమొదటే ఎవరికీ అర్థం చేయించకూడదు. మొదటైతే లౌకిక మాత-పిత, పారలౌకిక మాత-పితల రహస్యాన్ని అర్థం చేయించాలి. లౌకిక మాత-పితల నుండి అల్పకాలికమైన, క్షణభంగురమైన సుఖ వారసత్వం లభిస్తూ వచ్చింది. ఇది పక్కాగా గుర్తుండాలి. ఇంకెవ్వరూ ఇద్దరు తండ్రుల రహస్యాన్ని అర్థం చేయించలేరు. వారికి అసలు ఇది తెలియనే తెలియదు. నీవే తల్లివి, తండ్రివి... అని పాడుతారు. ఇప్పుడు తండ్రి సర్వవ్యాపి అయినట్లయితే మరి తల్లి ఏమైనట్లు? ఇది అర్థం చేసుకోవలసిన విషయం కదా. తల్లి-తండ్రి ఇరువురూ కావాలి కదా. మాత-పిత అని నిరాకారుడినే అంటారు. కానీ వారిని మాత-పిత అని ఎందుకు అంటారు అనేది అర్థం చేసుకోరు! వారు గాడ్ ఫాదర్. ఆ తర్వాత ఆడమ్ మరియు ఈవ్ అని అంటారు. ఆడమే ఈవ్ అన్నది అర్థం చేసుకోరు. ప్రజాపిత బ్రహ్మాయే తల్లిగా కూడా అవుతారు. ఆడమ్ మరియు ఈవ్ లేక ఆదమ్-బీబీ అని అంటారు కానీ అర్థాన్ని తెలుసుకోలేరు. వాస్తవానికి వీరే ఆదమ్-బీబీ అని పిల్లలు అర్థం చేసుకోగలరు. బీబీయే ఆదమ్. ఇతడిని ఆదమ్ మరియు బీబీ, రెండూ అంటారు. వారైతే తండ్రి. ఇవి చాలా క్లిష్టతరమైన విషయాలు. భారత్ లో నీవే తల్లివి, తండ్రివి... అని పాడుతారు కూడా. ఇలా వారు విన్న విషయాలపైనే పాడుతూ ఉంటారు, దాని అర్థాన్ని ఏమీ అర్థం చేసుకోరు.

సత్యయుగాన్ని చాలా దూరం తీసుకువెళ్ళారు. లక్షల సంవత్సరాలు అని అనేస్తారు. అనగనగా అని అన్నప్పుడు అది ఎంత కాలం క్రితము అని అర్థము? కథ అనేది ఎప్పుడూ సమీపంగా ఉన్నదాని గురించే వినిపించడం జరుగుతుంది. అనగనగా అంటే 5,000 సంవత్సరాల క్రితము ఈ భరత్ లో దేవీ-దేవతల అఖండమైన, స్థిరమైన, సుఖ-శాంతిమయమైన రాజ్యము ఉండేది, అప్పుడు ఇంకే రాజ్యమూ లేదు, ఇలా మీరు అర్థం చేయించవచ్చు. ఈ మాట ఇంకే విద్వాంసులు, ఆచార్యులు అనలేరు. దేవీ-దేవతల రాజ్యము ఉండేది, అది ఎలా స్థాపన అయ్యింది, లక్ష్మీ-నారాయణులు ఎలా తయారయ్యారు, వారి రాజ్యము ఎలా స్థాపన అయ్యింది, ఇవన్నీ తెలియాలి. అంతకుముందైతే కలియుగం ఉండేది. తప్పకుండా ఇప్పుడు ఇది కలియుగాంతము మరియు కలియుగము తర్వాత మళ్ళీ సత్యయుగము వస్తుంది. సత్యయుగము ఎదురుగా వచ్చేసింది. ఏదైతే అనగనగా అని ఉండేదో, అది ఇప్పుడు ఎదురుగా వచ్చేసింది. 84 జన్మలు తీసుకుంటూ-తీసుకుంటూ ఇప్పుడు కలియుగాంతము వచ్చి చేరుకుంది. 5,000 సంవత్సరాల క్రితం సత్యయుగంలో ఈ లక్ష్మీ-నారాయణుల రాజ్యముండేదని, అది ఇప్పుడు లేదని ఇప్పుడు మీరు చెప్తారు. ఇప్పుడు ఆ సమయం పూర్తయ్యింది. మళ్ళీ లక్ష్మీ-నారాయణుల రాజ్యం స్థాపన అవుతోంది, ఇది మీ బుద్ధిలో ఉంది, దీని కొరకే మీరు పురుషార్థం చేస్తున్నారు. ఇది అర్థం చేయించవలసిన విషయము. సత్యమైన గీత మొదలైనవి, ఎవరైనా చదివి రిఫ్రెష్ అవుతూ ఉండాలి అన్నందుకు వ్రాయబడతాయి. ఇలా ఏదైతే వ్రాయబడుతుందో, అది మళ్ళీ కనుమరుగైపోతుందని మీకు తెలుసు. ఈ సత్యమైన గీత కూడా ఉండదు. మీరు వ్రాసే సత్యమైన జ్ఞానము కనుమరుగైపోనున్నది మరియు దానితో పాటు శాస్త్రాలన్నీ కూడా కనుమరుగైపోతాయి. సత్య-త్రేతా యుగాలలో శాస్త్రాలు ఉండవు. మళ్ళీ కల్పపూర్వము ఏ విధంగా ద్వాపరము నుండి తయారయ్యాయో, అలా తయారవ్వడం మొదలవుతాయి. ఇది భక్తి మార్గపు సామగ్రి. రచన యొక్క సామగ్రి చాలా పెద్దది. మీరు జ్ఞానాన్ని క్షణంలో

తీసుకుంటారు. మొత్తం రచన యొక్క ఆదిమధ్యాంతాలను మీరు తెలుసుకున్నారు. తిథి-తారీఖు సహితముగా పూర్తి లెక్క ఉంది. అందరూ 84 జన్మలు తీసుకోరు. కొందరు 70, కొందరు 60 తీసుకుంటారు, కొందరు రెండు జన్మలు కూడా తీసుకుంటారు. తక్కువలో తక్కువ మరియు ఎక్కువలో ఎక్కువ ఎన్ని జన్మలు అన్న లెక్క ఉంటుంది. వెనుక వచ్చేవారికి తప్పకుండా నంబరువారుగా కొన్ని-కొన్ని జన్మలే ఉంటాయి. మళ్ళీ వాటి విస్తారంలోకి వెళ్ళడం అనవసరము. పిల్లలైన మీరు సారములో అర్థం చేసుకోగలరు. 84 లక్షల జన్మలైతే లేవు, 84 జన్మలు కూడా ప్రతి ఒక్కరూ తీసుకోలేరు. ఏదో అలా నామమాత్రంగా 84 జన్మల చక్రము అని అంటారు. 84 లక్షల జన్మల చక్రము అని మహిమ చేయరు. (పాట) పాపము మరియు కపటము యొక్క నీడ పడింది. ఇప్పుడు ఇది రావణ రాజ్యము కదా. ఆత్మపై మాలిన్యము యొక్క ఛాయ పడుతూ-పడుతూ ఇప్పుడు పూర్తిగా అజామిళ్ గా అయిపోయారు. ఎంత మురికి పట్టిందంటే, అసలు అది శుభ్రమే అవ్వదు. ఆ మురికిని తొలగించేందుకు జ్ఞాన మానస సరోవరములో మునిగి ఉండాలి అని అంటూ ఉంటారు. ఏ విధంగా తుప్పు పడితే దానిని కిరోసిన్లో వేస్తారో, అలాగే ఇక్కడ కూడా తుప్పు పట్టింది, అందుకే జ్ఞానసాగరునిలో మునిగి ఉండండి. ఇదేమీ నీటి నది లేక సాగరము యొక్క విషయము కాదు. జ్ఞానసాగరుడు ఏదైతే జ్ఞానాన్ని ఇస్తారో, ఆ జ్ఞానములో నిమగ్నమై ఉండాలి. గృహస్థ వ్యవహారాన్ని కూడా సంభాళించాలి. అందులో ఏదైనా సలహా కావాలంటే తీసుకుంటూ ఉండండి. ప్రతి ఒక్కరి కర్మబంధనము ఎవరిది వారిదే. సర్జన్ అందరికీ ఒకే మందును ఇవ్వరు. ప్రతి ఒక్కరి కర్మబంధనము, ప్రతి ఒక్కరి రోగము ఎవరిది వారిదే. ఈ పంచ వికారాల రోగము చాలా తీవ్రమైనది. ఈ రోగము గురించి ఎవరికీ తెలియనే తెలియదు. ఇది ఎప్పటి నుండి ప్రారంభమవుతుంది? ఆత్మకు రోగము అంటుకోవడంతో శరీరానికి కూడా రోగం అంటుకుంటుంది. ఆత్మకు దుఃఖము కలిగితే అది శరీరానికి కూడా కలుగుతుంది. ఈ విషయాలు శాస్త్రాలలో లేవు. అది భక్తి మార్గపు భక్తి కాండము. భక్తి గురించి కూడా బాబా అర్థం చేయించారు - మొదట అవ్యభిచారీ భక్తి ఉంటుంది, ఆ తర్వాత రజోగుణీ వ్యభిచారీ భక్తి, ఆ తర్వాత తమోగుణీ భక్తి. భక్తుల అవస్థ ఏ విధంగా ఉంటుందో, భక్తి కూడా అలాగే తయారువుతుంది. జ్ఞానము కూడా అలాగే దిగిపోతుంది. మొదట 16 కళలు, ఆ తర్వాత 14 కళలు, ఆ తర్వాత 12 కళలు... ఏ ప్రారబ్ధమైతే తయారవుతుందో అది మళ్ళీ దిగిపోతూ ఉంటుంది. ఇది సంపాదన అని పిల్లలైన మీకు తెలుసు. సంపాదనలో విఘ్నాలు కలుగుతాయి, దశలు మారుతాయి. మాపై ఏ దశ కూర్చుంది అని అడిగితే వాళ్ళు చెప్తూ ఉంటారు. ఈ సత్యమైన సంపాదనలో కూడా పిల్లలపై దశలు కూర్చుంటాయి. కొందరిపై రాహు దశ కూర్చుంటుంది, నల్ల ముఖం చేసుకుంటారు. బృహస్పతి దశ ఉండేది, తర్వాత మాయ చెంపదెబ్బ వేయడంతో రాహు దశ కూర్చుంటుంది. కామంలో పడ్డారంటే వెంటనే రాహువు గ్రహణం పడుతుంది, తాళం మూసుకుపోతుంది. ఇది గుప్తమైన, కఠినమైన శిక్ష. వారు ఇంకెప్పుడూ - భగవానువాచ కామం మహాశత్రువు అని చెప్పలేరు. సన్యాసులు కూడా కామమనే మహాశత్రువు కారణముగానే తమ భార్యను వదిలి వెళ్ళిపోతారు. ఈ నివృత్తిమార్గపు పవిత్రత కూడా భారతవాసులకు మంచిదే. భారతవాసులే పవిత్రుల నుండి అపవిత్రులుగా అవుతారు, కావున వారిని నిలబెట్టేందుకు ఈ సన్యాసులు ఉన్నారు. ఆ పవిత్రత మరమ్మతులు చేసేందుకు ఉపయోగపడుతుంది. పవిత్రతా శక్తితోనే సృష్టి ఇంతవరకూ నడుస్తుంది. ఇప్పుడైతే వారు కూడా పతితులుగా అయిపోయారు. మీరు వారి సేవను కూడా చేయాలి. సేవ చేయాలనే అభిరుచి పిల్లలకు ఎంతగానో ఉండాలి.

నియమ విరుద్ధమైన నడవడిక ఏమీ నడవకూడదు. అందరూ పురుషార్థులే, సంపూర్ణముగా ఎవ్వరూ అవ్వలేదు. ఏవో ఒక పాపాలు జరుగుతూ ఉంటాయి. తండ్రి ఆజ్ఞను పాటించలేదంటే ఇది కూడా పెద్ద పాపమే. తండ్రి ఆజ్ఞ - నిరంతరము నన్ను స్మృతి చేయండి. అలా చేయలేరని నాకు తెలుసు. కానీ మీరు పూర్తి పురుషార్థమే చేయరు. ఎవరైతే చేస్తారో వారు మంచి పదవిని పొందుతారు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. పంచ వికారాల రోగము నుండి ముక్తులుగా అయ్యేందుకు సర్జన్ నుండి సలహా తీసుకుంటూ ఉండాలి. ఆత్మకు ఏ రోగమూ అంటకూడదు, ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలి.

2. సత్యమైన సంపాదనను చేసుకోవాలి మరియు చేయించాలి. ఏ విధమైన నియమ విరుద్ధమైన నడవడికను

నడవకూడదు. రాహు దశ ఎప్పుడూ కూర్చోకూడదు, దీని కొరకు తండ్రి ఆజ్ఞపై సదా నడుచుకోవాలి.

వరదానము:- స్మృతి మరియు సేవ ద్వారా అన్ని వలయాలను సమాప్తము చేసి దీపముపై బలిహారమయ్యే సత్యమైన దీపముపురుగుగా కండి

ఏ పిల్లలైతే స్మృతి మరియు సేవలో సదా బిజీగా ఉంటారో, వారు అన్ని వలయాల నుండి సహజముగానే ముక్తులవుతారు. ఏ వలయాలైనా మిగిలి ఉంటే ఇక అలా తిరుగుతూనే ఉంటారు. ఒక్కోసారి సంబంధాల వలయాలు, ఒక్కోసారి తమ స్వభావ-సంస్కారాల వలయాలు... ఎప్పుడైతే బుద్ధిలో ఒక్క దీపము తప్ప మరేమీ ఉండదో అప్పుడు ఇటువంటి వ్యర్థము యొక్క వలయాలన్నీ సమాప్తమవుతాయి. దీపముపై బలిహారమయ్యేవారు దీపము సమానంగా అయిపోతారు. ఇలా బలిహారమయ్యేవారే అనగా ఇమిడిపోయేవారే సత్యమైన దీపపు పురుగులు.

స్లోగన్:- ఎవరైతే సత్యమైన పారసముగా అయ్యారో, వారి సాంగత్యములో ఇనుములాంటి ఆత్మలు కూడా బంగారములా అవుతారు.